తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
08-07-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 150
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## భూదాన్ రెడ్డి ఇకలేరు!

- రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కూడబెట్టని ఆస్తులు
- సొంత ఇల్లు కూడా లేని నిరాడంబర జీవితం
- ప్రజా నాయకుడి కొమ్మిడి నర్సింహారెడ్డి అంతిమ ప్రస్థానం
- ప్రజలందరూ ప్రేమగా పిలుచుకునే పేరు 'భూదాన్ రెడ్డి'
- నిరాడంబరత్వానికి, నిజాయితీకి నిలువెత్తు రూపం
- 300 ఎకరాల సాగు భూమిని నిరుపేదలకు పంచిపెట్టిన గొప్ప మానవతావాది
- గోదావరి జలాలను మూసీ నదిలోకి మళ్లించే బ్లూప్రింట్ రూపకల్పన
- ఇచ్చంపల్లి బ్యారేజీ, బీబీనగర్ నిమ్స్ కోసం ఆమరణ దీక్ష చేసిన పోరాట యోధుడు

2






# గద్వాల్ విద్యుత్ సర్కిల్‌లో గందరగోళం..!

- పాత తేదీతో డిస్పాచ్..
- నిషేధం ఉన్నా బదిలీలపై ఉద్యోగ సంఘాల ఫైర్
- కార్యాలయంలో మూడు రోజులుగా ఉద్యోగుల భారీ ధర్నా
- ఆరు రోజులుగా ఖాళీగా ఉన్న ఎస్ఈ సీటు
- ఇంచార్జ్ బాధ్యతలు ఇవ్వకపోవడంపై పెరుగుతున్న అనుమానాలు
- మొండి వైఖరితో చక్రం తిప్పుతున్న సీనియర్ అధికారి

### ఎస్ఈ బదిలీ అయ్యాక ఉత్తర్వులు



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
గద్వాల్ జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో గత కొద్ది రోజులుగా తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇక్కడి నుండి బదిలీ అయ్యే ఒక్క రోజు ముందు నిబంధనలకు విరుద్ధంగా చేసిన సిబ్బంది బదిలీలు అక్కడ ఉద్యోగ సంఘాల తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ అక్రమ

మిగతా 2వ పేజీలో..




## విద్యుత్ ఉద్యోగుల భద్రతపై టీజీఎస్పీడీసీఎల్ దృష్టి

- వరుస ప్రమాదలతో అప్రమత్తం
- ప్రమాద రహితంగా ఉండేలా కఠిన చర్యలు
- నేడు క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సీఎండీ ముఖాముఖీ



**హైదరాబాద్, జూలై 7 (సిరి న్యూస్):**
టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో వరుసగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై యాజమాన్యం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. సిబ్బంది ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రమాద రహిత పని వాతావరణాన్ని కల్పించేందుకు సీఎండీ జితేష్ వి. పాటిల్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందితో నేరుగా ముఖాముఖి సమావేశమై, వారి సమస్యలు మరియు భద్రతా పరమైన సవాళ్లను తెలుసుకోవాలని నిర్ణయించారు. బుధవారం హైదరాబాద్‌లోని సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ యూసుఫ్‌గూడలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సంస్థ పరిధిలోని 21 సర్కిళ్ల నుండి లైన్‌మ్యాన్‌లు, అసిస్టెంట్ లైన్‌మ్యాన్‌లు, జూనియర్ లైన్‌మ్యాన్‌ల ప్రతినిధులు మొత్తం 40 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, ప్రమాదాలకు దారితీసే

మిగతా 3వ పేజీలో..

## డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

- క్షేత్రస్థాయి అధ్యయనానికి కమిటీ
- వంద రోజుల్లో కొలిక్కి తీసుకురావాలి
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమీక్ష

**హైదరాబాద్, జూలై 7, సిరి న్యూస్ :**
పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని

మిగతా 3వ పేజీలో..





## కవితకు కలిసి రాని టీఆర్ఎస్

- కొత్త పార్టీకి పేరు చిక్కులు..
- టీఆర్ఎస్ పేరుకు ఈసీ నిరాకరణ
- ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఆదేశాలు
- 'జాగృతి' వైపు చూపు?
- న్యాయపోరాటమా.. లేక కొత్త పేరుతో ముందుకా?
- రాజకీయ వర్గాల్లో 'జాగృతి' పేరుపై చర్చ

**హైదరాబాద్, జూలై 7, సిరి న్యూస్ :**
బీఆర్ఎస్‌ను వీడి సొంత రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత తొలి అడుగులోనే పార్టీ పేరు

మిగతా 3వ పేజీలో..

### కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

- టీఆర్ఎస్ సంక్షిప్త నామంపై వెంటనే జోక్యం చేసుకోబోమన్న కోర్టు
- ఈసీ ముందు వివరణ ఇవ్వాలని కవితకు సూచన
- వ్యక్తిగత వాదనకు అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘానికి ఆదేశం

3



## మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

- ప్రతి చిన్నారికి సేవలే లక్ష్యంగా ప్రభుత్వ వినూత్న కార్యక్రమం
- వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య అందుబాటులోకి
- మొదటి దశలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభం

2

## రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

- రూ.360 కోట్లతో శాశ్వత భవనాలు
- 10 ఆర్డీవో, 107 తహసిల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూలై 7, సిరి న్యూస్ :**
రాష్ట్రంలో రెవెన్యూ పాలనను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని

మిగతా 3వ పేజీలో..



## ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ



- బాధ్యతాయుత సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 7 , సిరి న్యూస్:**
కృత్రిమ మేధస్సు(ఏఐ) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని, కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక పర్యావరణ

మిగతా 3వ పేజీలో..



## ప్రైవేటీకరిస్తే ఊరుకోం..

- జెన్కోకు నష్టాన్ని కలిగించే టెండర్లను వెంటనే రద్దు చేయాలి
- టెండర్లు రద్దయ్యేవరకు పోరాటం ఆపేది లేదు
- వైటీపీఎస్ వద్ద పవర్ జాక్ నాయకుల గర్జన

2

## తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

- వర్షాభావ పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రతి గ్రామానికి నిరంతరాయ నీటి సరఫరాపై ఆదేశాలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచన
- జలాశయాల నీటి మట్టాలపై నిరంతర పర్యవేక్షణ

2

## పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

- రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి

**రంగారెడ్డి, జూలై 7, సిరి న్యూస్:**
ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో రూ.338 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో..






## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి
- సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ లేఖ

3

## ప్రజలకు చేరువగా పోలీసింగ్.. సాంకేతికతతో నేర నియంత్రణ

- నిజాయితీ, నిష్పాక్షికతతో విధులు నిర్వహించాలి
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి:
- డీజీపీ సీవీ ఆనంద్



3

## తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 7, సిరి న్యూస్**

రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమైనా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ బోర్డు సమావేశంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా, జలాశయాల్లో నీటి నిల్వలు, రానున్న నెలల అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

**ముందస్తు ప్రణాళికతో చర్యలు**

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. వర్షపాతం తగ్గినా, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా ముందస్తు ప్రణాళికతో పనిచేసి ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**జలాశయాలపై నిత్య పర్యవేక్షణ**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల్లో 45, 90, 180 రోజుల అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు. జలాశయాల నీటి మట్టాలను ప్రతిరోజూ పరిశీలిస్తూ నీటిపారుదల శాఖతో సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి**

జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసే అంశంపై నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించేలా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని చెప్పారు.సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే కొత్త బోర్‌వెల్‌లు తవ్వడం, పాత బోర్‌వెల్‌లను పునరుద్ధరించడం, అద్దె బోర్‌వెల్‌లను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 7, సిరి న్యూస్**

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి అంగన్వాడి సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ కలిసి మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తొలి దశలో ఈ వాహనం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులే దేశ సంపద, భావితరాలకు పునాదని అన్నారు. తెలంగాణ-2047 లక్ష్యాల సాధనలో నేటి చిన్నారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి-శిశు సంక్షేమ సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వచ్చే కుటుంబాల చిన్నారులు అంగన్వాడి సేవలు కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో సాధారణ అంగన్వాడి కేంద్రాల్లో అందించే అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి-శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలను నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్తామని చెప్పారు. ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి సీతక్క వెల్లడించారు. ఒక్కో వాహనం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గద్వాల్ విద్యుత్ సర్కిల్‌లో గందరగోళం..!

**మొదటిపేజీ తరువాయి**

బదిలీలపై నిలదీసేందుకు, సమాధానం చెప్పడానికి జిల్లా విద్యుత్ సూపరింటెండింగ్ అధికారి సీట్లో ఎవరూ లేకపోవడం, కొత్తగా ఎవరూ ఛార్జ్ తీసుకోకపోవడం ఉద్యోగుల ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. సాంకేతిక సమస్యలు రాకుండా పాత తేదీలతో డిస్పాచ్ చేసిన ఈ బదిలీల వ్యవహారం ఇప్పుడు విద్యుత్ శాఖలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. గద్వాల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పనిచేసిన శ్రీనివాసరెడ్డి గత నెల 30వ తేదీన హైదరాబాద్‌కు బదిలీ కాగా, జులై ఒకటవ తేదీన ఆయన ఇక్కడి నుండి రిలీవ్ అయ్యారు. అయితే, ఆయన రిలీవ్ అయి వెళ్ళిపోయిన తర్వాత నలుగురు ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు హఠాత్తుగా బయటకు రావడం కలకలం రేపింది. ఎస్ఈ బదిలీ ఉత్తర్వుల కంటే ఒక రోజు ముందు రోజు డిస్పాచ్‌లను చూపిస్తూ.. జులై 2వ తేదీన ఇద్దరు జేఏఓలకు, ఒక లైన్ మెన్‌కు, ఒక ఆర్టీషియన్‌కు ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. విద్యుత్ సంస్థలో ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలపై స్పష్టమైన బ్యాన్ ఉన్నప్పుడు ఈ బదిలీలు ఎలా చేస్తారని, అదీ పాత తేదీలతో ఉత్తర్వులు ఎలా ఇస్తారని ఉద్యోగ సంఘాల నేతలు నిలదీస్తున్నారు.

**మూడు రోజులుగా ధర్నా.. పట్టించుకోని సీఈ**

గద్వాల్ సర్కిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు ఉద్యోగ సంఘాలు గత మూడు రోజులుగా సర్కిల్ కార్యాలయంలోనే బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఉద్యోగుల సమస్యను వినడానికి, వారితో మాట్లాడటానికి ఒక్క అధికారి కూడా రాకపోవడం గమనార్హం. గద్వాల్‌లో మూడు రోజులుగా ఆందోళనలు జరుగుతున్నా చీఫ్ ఇంజనీర్ కనీసం ఇటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఎస్ఈ లేనప్పుడు సహజంగా ఆ సర్కిల్ బాధ్యతలను చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షించాల్సి ఉంటుంది, కానీ సదరు ఉన్నతాధికారి ఈ గొడవను పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరు రోజులుగా ఖాళీగా ఎస్ఈ సీట్..**

**అసలు ఎస్ఈ ఎవరు?**

గద్వాల్ సర్కిల్‌లో నిరసనలు ఉధృతం కావడానికి ఇక్కడ గత ఆరు రోజులుగా ఎస్ఈ సీట్ ఖాళీగా ఉండటం కూడా ఒక ప్రధాన కారణమవుతోంది. గత నెల 30వ తేదీన శ్రీనివాసరెడ్డి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో వేణుగోపాల్ ప్రమోషన్‌పై ఇక్కడికి రావాల్సి ఉంది. కానీ ఆయన ఇప్పటివరకు విధుల్లో జాయిన్ కాలేదు. అలాంటప్పుడు ఉన్నతాధికారి అయిన సీఈ అయినా ఇంచార్జ్ బాధ్యతలు తీసుకోవాలి లేదా కనీసం అక్కడున్న డీఈ టెక్నికల్‌కైనా ఇంచార్జ్



ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ అలాంటి తాత్కాలిక ఏర్పాట్లు కూడా చేయలేదు. ఇలా ఒక జిల్లా స్థాయి కీలక కార్యాలయంలో 6 రోజులుగా ప్రధాన అధికారి ఎవరూ లేకపోవడం మూలంగా సర్కిల్ పరిధిలోని ఎన్నో అత్యవసర సమస్యల పరిష్కారానికి, రోజువారీ విధులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**చక్రం తిప్పుతున్న జిల్లా సీనియర్ అధికారి**

గద్వాల్ సర్కిల్‌లో ప్రస్తుతం నెలకొన్న ఈ మొత్తం గందరగోళానికి, అక్రమ బదిలీల ప్రక్రియకు అక్కడి సర్కిల్‌లోని ఒక సీనియర్ అధికారే ముఖ్య కారణమని విశ్వసనీయ సమాచారం. ఇదివరకు గద్వాల్ డివిజన్ కార్యాలయంలో ఉన్న ఒక అధికారి విధులకు సరిగ్గా హాజరు కావడం లేదని ఆ డివిజన్ డీఈ ఫిర్యాదు చేస్తే.. సదరు సీనియర్ అధికారి తనకున్న పట్టుతో ఆ ఫిర్యాదును పక్కనపెట్టి, సదరు ఉద్యోగిని తన సెక్షన్లకే బదిలీ చేయించుకున్నాడట. ఇప్పుడు ఇంత గొడవకు కారణమైన బదిలీలలో సైతం ఇద్దరు జేఏఓలు ఒకే కార్యాలయంలో కేవలం ఒక ఫ్లోర్ నుండి ఇంకో ఫ్లోర్‌కు మారారంతే. ఇలా గద్వాల్ విద్యుత్ సర్కిల్‌ను వివాదాల్లోకి నెట్టడం వెనుక ఆ సీనియర్ అధికారి మొండి వైఖరే కారణమని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ బదిలీలను రద్దు చేయాలని, గద్వాల్ సర్కిల్‌కు పూర్తి స్థాయి ఎస్ఈని నియమించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ రాష్ట్రాన్నిమరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎంపీచామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**హ్యామ్ రోడ్ల నిర్మాణంతో**

**మారనున్న రూపురేఖలు**

హైదరాబాద్ : రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హ్యామ్ రోడ్లకు ఇటీవల సిఎం శంకుస్థాపన చేయడంతో రాష్ట్రంలో రోడ్ల స్వరూపం మారబోతోందన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని, గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల దుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే హైదరాబాద్ రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని, ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి భరోసా ఇచ్చారు.

## ‘భూదాన్ రెడ్డి’ ఇకలేరు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ ఉద్యమ చరిత్రలో, ప్రజా పోరాటాల ప్రస్థానంలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న నిరాడంబర ప్రజా నాయకుడు, మాజీ శాసనసభ్యుడు కొమ్మిడి నరసింహారెడ్డి (83) మంగళవారం కన్నుమూశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ భూస్వామ్య కుటుంబంలో కొమ్మిడి రామచంద్రారెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు 1943 సెప్టెంబర్ 10న ఆయన జన్మించారు. తల్లిదండ్రులకు ఉన్న ఐదుగురు సంతానంలో (కోదండరామిరెడ్డి, శశిరేఖ, సుగుణ, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి) ఆయన నాలుగో వారు. ఊరిలో 400 ఎకరాల భూమి, రెండు అంతస్తుల మేడ, గుర్రాలు, వందలాది పశువులతో పాటు తండ్రి పోలీస్ పటేల్‌గా చలామణి అవుతున్నా, సాయుధ పోరాట వీరుడైన అన్న కోదండరామిరెడ్డి ఆదర్శ భావాల వల్ల వారి కుటుంబంలో ఎన్నడూ ఆధిపత్య ధోరణి ఉండేది కాదు. ప్రజలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నిలిపారు.

**సర్పంచ్ నుండి శాసనసభ్యుడి వరకు..**

కొమ్మిడి నరసింహారెడ్డి 1962 నుండి 1970 వరకు ఎనిమిదేళ్ల పాటు తన స్వగ్రామం బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా సేవలందించారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పోరాట సమితి భువనగిరి తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత 1978 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున భువనగిరి నియోజకవర్గం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మళ్లీ 1983 ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎన్టీ రామారావు ప్రభంజనం నడుస్తున్నప్పటికీ, భువనగిరిలో కాంగ్రెస్ నుండే రెండోసారి కూడా ఘన విజయం సాధించి తన ప్రజాదరణను నిరూపించుకున్నారు. అయితే, 1985 మధ్యంతర ఎన్నికల సమయానికి ఎన్నికల ఖర్చును భరించలేని ఆర్థిక పరిస్థితి ఏర్పడటంతో ఆయన స్వచ్ఛందంగా పోటీ నుండి తప్పుకున్నారు. రాజకీయాల్లో చిన్న పదవి వచ్చినా కోట్లు వెనకేసుకునే రోజుల్లో.. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా ఆయన ప్రజాధనాన్ని ఆశించలేదు, రూపాయి ఆస్తి కూడబెట్టలేదు. సొంత కారు కూడా లేక కేవలం ఒక సాధారణ బజాజ్ చేతక్ స్కూటర్ పైనే నియోజకవర్గమంతా తిరిగిన మహోన్నత వ్యక్తి ఆయన.

**అడిగితే వందల ఎకరాల**

**భూదానం.. అందుకే ‘భూదాన్ రెడ్డి’**

కొమ్మిడి నరసింహారెడ్డి ఆస్తిని పెంచుకోవడం కాదు, ఉన్న ఆస్తిని పేదలకు పంచడంలో ఆనందాన్ని వెతుక్కున్నారు. తన సొంత వాటా కిందకు వచ్చిన భూమిలో ఏకంగా 300 ఎకరాల సాగు భూమిని భూమి లేని నిరుపేదలకు, దళితులకు పంచి ఇచ్చి ఒక కాలనీని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, సీలింగ్ చట్టం ప్రకారం మరో 80 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ఆయన చేసిన ఈ అద్వితీయ త్యాగానికి గుర్తింపుగా ప్రజలందరూ ఆయనను ఇప్పటికీ ‘భూదాన్ రెడ్డి’ అని ప్రేమగా, అభిమానంగా పిలుచుకుంటారు.

**గోదావరి జలాలు, నిమ్స్ కోసం**

**చారిత్రాత్మక పోరాటాలు..**

గోదావరి నదీ జలాలను భువనగిరి, ఆలేరు ప్రాంతాలకు అందించాలని, ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని ఆయన అలుపెరుగని పోరాటాలు చేశారు. గోదావరి జలాలను మూసీ నదిలోకి మళ్లించడం ద్వారా లక్ష ఎకరాల భూములను ఎలా సశ్యశ్యామలం చేయవచ్చో ఒక బ్లూప్రింట్ తయారుచేసి, దాన్ని ఫ్లెక్సీపై ముద్రించి గచ్చుపై పరచి మరి నాయకులకు, జర్నలిస్టులకు ఒక ఉపాధ్యాయుడిలా వివరించేవారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంత కాలుష్య నివారణ కోసం శ్రమించారు. జాతీయ రహదారి 202 విస్తరణలో ఇండ్లు, పొలాలు కోల్పోయిన రంగాపురం నిర్వాసితులకు భూదాన్ భూముల నెపంతో నష్టపరిహారం ఆపితే, వారికి న్యాయం జరగాలని పోరాడారు. 2013 మార్చిలో బీబీనగర్‌లో భూతబంగ్లాగా మారిన నిమ్స్ భవనాలను రిఫరల్ ఆసుపత్రిగా మార్చాలని, తెలంగాణ వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వృద్ధాప్యంలోనూ ఆమరణ దీక్షకు దిగారు.

**సొంత ఇల్లు కట్టుకోవాలనే**

**కల నెరవేరకుండానే..**

జీవిత చరమాంకంలో పిల్లలను చదివించడానికి మిగిలిన కొంత భూమిని అమ్మేయగా, ఉన్న మరికొంత భూమి బొల్లేపల్లి కాలువ తవ్వకాల్లో పోయింది. ఆ భూమికి ప్రభుత్వం నుండి రావలసిన నష్టపరిహారం అందితే.. అద్దె ఇల్లు వదిలి ఒక చిన్న సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోవాలని నరసింహారెడ్డి భావించారు. ఇందుకోసం సీఎంలు, కలెక్టర్ల చుట్టూ తిరిగి వినతిపత్రాలు ఇచ్చినా ఆ పరిహారం డబ్బులు అందలేదు. చివరకు అద్దె ఇంట్లోనే, సొంత ఇల్లు లేని ప్రజాప్రతినిధిగా ఆయన కన్నుమూయడం నేటి రాజకీయ వ్యవస్థకు ఒక గుణపాఠం. ఆయన భార్య సుకన్యమ్మ కాగా, ఈ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు సాధారణ ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. తన జీవితాన్ని, సర్వస్వాన్ని ప్రజా సంక్షేమం కోసం అంకితమిచ్చి, నిజాయితీకి నిలువెత్తు రూపంగా నిలిచిన కొమ్మిడి నరసింహారెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా, తెలంగాణ చరిత్రలో ఆయన పేరు సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది.

## ప్రైవేటీకరిస్తే ఊరుకోం..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఏమాత్రం సహించేది లేదని తెలంగాణ పవర్ జాక్ నాయకులు తేల్చిచెప్పారు. సంస్థకు నష్టం కలిగించేలా ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియకు వ్యతిరేకంగా మంగళవారం వైటిపిఎస్ ఆవరణలో ఉద్యోగులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ జాక్ రాష్ట్ర కార్యదర్శి ఈ. శ్రీధర్ మాట్లాడుతూ, జెన్కోలోని యాష్, కాల్ యూనిట్ల నిర్వహణకు ప్రభుత్వం టెండర్లు పిలవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మా ఉద్యోగులు అతి తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలిగిన పనులను, సంస్థకు భారమయ్యేలా ఎక్కువ రేటుకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం వెనుక ఆంతర్యమేమిటి? అని ప్రశ్నించారు. తెలంగాణ విద్యుత్ రంగం నష్టాల బాట పట్టడానికి ప్రభుత్వాల విధానాలే కారణమని, గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే ప్రస్తుత ప్రభుత్వం నడవడం బాధాకరమని అన్నారు. డిప్యూటీ సీఎం వద్దకు తీసుకెళ్లినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని, అయితే ఇంధన శాఖ కార్యదర్శి మాత్రం ఒంటెద్దు పోకడలతో ఉద్యోగులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కన్వీనర్



రత్నాకర్ రావు మాట్లాడుతూ.. మా ఇంజినీర్లు ప్రభుత్వానికి నిధులు ఎలా ఆదా చేయాలో లెక్కలతో సహా వివరించారు. అయినప్పటికీ ప్రైవేటుకే అప్పగిస్తామనడం వెనుక భారీ కుట్ర దాగి ఉంది అని ఆరోపించారు. ఈ టెండర్ల వ్యవహారాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కోకన్వీనర్ తాజుద్దీన్, నాయకులు శాండీఓ రెడ్డి, వజీర్, మహేష్, కరుణాకర్ రెడ్డితో పాటు టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ నుండి వందలాది మంది ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. నినాదాలతో వైటీపీఎస్ ప్రాంగణం హోరెత్తింది.



# కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

**న్యూఢిల్లీ, జూలై 7, సిరి న్యూస్**

కొత్త రాజకీయ పార్టీ పేరుకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తన పార్టీకి తెలంగాణ రక్షణ సమితి లేదా తెలంగాణ రక్షణ సేన పేరును నమోదు చేసి, టీఆర్ఎస్ సంక్షిప్త నామాన్ని కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరిన పిటిషన్‌పై నేరుగా జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియలో ఈ దశలో జోక్యం చేసుకోవడం సముచితం కాదని స్పష్టం చేసింది.

**ఈసీ అభ్యంతరాలపై వివరణ కోరిన కోర్టు**

కవిత కొత్త పార్టీ పేరుకు సంబంధించి ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేయగా, టీఆర్ఎస్ సంక్షిప్త నామంతో పోలిక ఉన్న పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు ఈసీ తెలియజేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కవిత నేరుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఉద్యమంతో టీఆర్ఎస్ పేరుకు తమకు అనుబంధం ఉందని, ఆ సంక్షిప్త నామాన్ని వినియోగించే హక్కు తమకూ ఉందని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు.

**ఎన్నికల సంఘం స్వతంత్ర అధికారాలపై వ్యాఖ్యలు**

విచారణ సందర్భంగా టీఆర్ఎస్ సంక్షిప్త నామానికి దగ్గరగా ఉండే పేరును అనుమతించాలా వద్దా అనే అంశం ఎన్నికల సంఘం పరిధిలోని విషయమని హైకోర్టు పేర్కొంది. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న ఇతర రాజకీయ సంస్థలు నమోదై ఉన్నాయని, అలాగే బీఆర్ఎస్ కూడా ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నేరుగా ఆదేశాలు జారీ చేయడం సరికాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

**వ్యక్తిగత వాదనకు అవకాశం**

అయితే కవితకు హైకోర్టు తాత్కాలిక ఊరటనిచ్చింది. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులకు వారం రోజుల్లోగా రాతపూర్వక వివరణ సమర్పించాలని సూచించింది. ఆ వివరణ అందిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా, కవితకు వ్యక్తిగతంగా తన వాదనలు వినిపించే అవకాశం కల్పించి అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. పార్టీ పేరు వ్యవహారంలో ఎన్నికల సంఘం తుది నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. టీఆర్ఎస్ సంక్షిప్త నామం లభించకపోతే కవిత ప్రత్యామ్నాయ పేరుతో ముందుకు వెళ్తారా అనే అంశంపైనా చర్చ కొనసాగుతోంది.

# కవితకు కలిసి రాని టీఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి**

వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించినప్పటికీ, ఆ పేరుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు రావడంతో ఆ పేరును తిరస్కరించిన ఈసీ, 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని ఆదేశించినట్లు సమాచారం.

**న్యాయపోరాటంపై దృష్టి**


ఈసీ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేస్తానని కవిత ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే కొత్త పార్టీ ప్రారంభ దశలోనే పేరు వివాదం కోర్టుల వరకు వెళ్లడం కేడర్‌లో, ప్రజల్లో అయోమయానికి దారితీసే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పేరుపై స్పష్టత లేకపోతే సంస్థాగత నిర్మాణం, ప్రచార కార్యక్రమాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చివరకు పేరు మార్చాల్సిన పరిస్థితి వస్తే మరింత గందరగోళం నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**'జాగృతి' పేరుపై చర్చ**

కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు వార్తలు వచ్చినప్పటి నుంచి ఆమె చాలా కాలంగా నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి సంస్థనే రాజకీయ పార్టీగా మార్చవచ్చనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా టీఆర్ఎస్ పేరును ఎంచుకోవడంతో పరిస్థితి మారింది. తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. గ్రామ, మండల స్థాయిలో కూడా ఈ సంస్థకు విస్తృత స్థాయిలో కార్యకర్తల నెట్‌వర్క్ ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**త్వరగా స్పష్టత అవసరం**

ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందిన తెలంగాణ జాగృతి లేదా దానికి సమానమైన పేరుతో పార్టీని ముందుకు తీసుకెళితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టపరమైన వివాదాల్లో సమయం వృథా చేసుకోవడం కంటే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుని సంస్థాగత బలోపేతంపై దృష్టి పెట్టడం మంచిదని కొందరు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే పార్టీ పేరుపై కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





# విద్యుత్ ఉద్యోగుల భద్రతపై టీజీఎస్పీడీసీఎల్ దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

కారణాలను సిబ్బంది నుండి నేరుగా తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

**భద్రతా ప్రమాణాలపై సమగ్ర సమీక్ష**

విద్యుత్ స్తంభాలు ఎక్కే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, లైన్ క్లియరెన్స్ విధానాల అమలు, వ్యక్తిగత భద్రతా పరికరాల వినియోగం మరియు అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రోటోకాల్‌లపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు. ఫీల్డ్‌లో పనిచేసే సిబ్బంది ఎదుర్కొంటున్న సాంకేతిక, వృత్తిపరమైన సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలను సీఎండీ జారీ చేయనున్నారు.

**భద్రతా సంస్కృతిని బలోపేతం చేసే దిశగా..**

సంస్థలో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయడమే మా లక్ష్యం. ఉద్యోగుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ప్రమాదాల నివారణకు మరింత సమర్థవంతమైన కార్యాచరణను రూపొందిస్తాం అని యాజమాన్యం పేర్కొంది. ప్రతి ఉద్యోగి సురక్షితంగా విధులు నిర్వహించి, తిరిగి సురక్షితంగా తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ సమావేశం ద్వారా భద్రతాయుతమైన పని విధానాలను ప్రోత్సహించడంతో పాటు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తామని సంస్థ తెలిపింది.



## ప్రజలకు చేరువగా పోలీసింగ్..

# సాంకేతికతతో నేర నియంత్రణ

**ఖమ్మం, జూలై 7, సిరి న్యూస్**

ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిజాయితీ, నిష్పాక్షికత, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌నే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఖమ్మంలో నిర్వహించిన నేరాల సమీక్ష సమావేశంలో జిల్లా పోలీసింగ్ పనితీరు, నేర నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తం**

జిల్లాలో ఆర్థిక మోసాలు 30 శాతం, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు 36 శాతం పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. నకిలీ పత్రాల కేసులు కూడా పెరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ ఏడాది సైబర్ నేరాలకు 711 మంది బాధితులై రూ.9.48 కోట్లు కోల్పోగా, అందులో రూ.1.41 కోట్లను పోలీసులు తిరిగి బాధితులకు అందించారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు.

**మాదకద్రవ్యాలపై రాజీలేని పోరు**

మాదకద్రవ్యాల నిర్మూలనకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగించాలని డీజీపీ ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో 1,700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా గంజాయి పట్టుబడుతున్న జిల్లాల్లో ఖమ్మం ఒకటిగా ఉందని పేర్కొంటూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**సాంకేతికతతో భద్రత బలోపేతం**

పర్యటన సందర్భంగా జిల్లా కమాండ్ సెంటర్‌కు అనుసంధానించిన 250 కొత్త సీసీ కెమెరాలు, కమిషనరేట్ సీసీ కెమెరాల కమాండ్ సెంటర్‌ను డీజీపీ ప్రారంభించారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రజలను అభినందించారు. రోడ్డు భద్రతా పార్కును సందర్శించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గత ఏడాది 317గా ఉన్న రోడ్డు ప్రమాదాల సంఖ్య ఈ ఏడాది 146కు తగ్గడం అభినందనీయమని పేర్కొన్నారు.

పోలీసులు చట్టానికి లోబడి నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని, పేదలు, బలహీన వర్గాలకు ముందుగా న్యాయం అందేలా పనిచేయాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇసుక, మట్టి అక్రమ రవాణా, రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. త్వరలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ బ్యూరోను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించారు. ఎంసీఆర్ హెచ‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతోపాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాల చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ వంద రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎంఏ అండ్ య□డీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఎంసీహెచ‌ఆర్డీ వైస్ చైర్మన్ శాంతికుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్.శివశంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

పరిరక్షణ, సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ‌ఐసిసి వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ ది హైదరాబాద్ కలెక్టివ' కార్యక్రమాన్ని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. 'ది మెరిడియన్ కలెక్టివ' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ సమ్మిట్ జరగనుంది. వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి, మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. తాము ఏఐ వద్దు అనడం లేదు.. కానీ అది ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను ముఖ్యంగా నీరు, విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాక పునరుత్పాదక ఇంధనం, బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో దూకుడుగా ఉన్నప్పటికీ అది పర్యావరణానికి, స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. 'కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి.. స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి.. రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి.. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో తెలంగాణ 'పీపుల్స్




క్రెడిట' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తున్నదని అన్నారు. పెట్టుబడులు రావాలి.. కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**రైతులకు, సామాన్యులకు భరోసా:**

వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు.. ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల' అని గర్వంగా ప్రకటించారు. పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే 'ప్రజల పక్షపాతి'గా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతోపాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కూఆ పాల్గొన్నారు.

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

**హైదరాబాద్,జూలై 7, సిరి న్యూస్:**

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను, నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖ మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై శ్రీహరి దుష్ప్రచారం చేశారని సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తనను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న చర్యల వల్ల శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియంపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని సురేఖ కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

# రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో, అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని ఆయన చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లాస్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మితమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. అయిదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని, ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు.

## గుండె జబ్బుతో బాధపడుతున్న మహిళకు అండగా ఆర్కే ఫౌండేషన్

**రూ.20 వేల ఆర్థిక సాయం అందించిన కాల్వగడ్డ రాజ్‌కుమార్**



**పటాన్‌చెరు, జూలై 7 (సిరి న్యూస్):**

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఆర్కే ఫౌండేషన్ అధినేత కాల్వగడ్డ రాజ్‌కుమార్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామానికి చెందిన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళ కంది ఉష వైద్య చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.కంది ఉష కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన రాజ్‌కుమార్, చికిత్సకు తక్షణ అవసరాల కోసం రూ.20 వేల నగదును అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. భవిష్యత్తులో కూడా అవసరమైతే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కంది ఉష భర్త కంది శ్రీరాములు మాట్లాడుతూ, కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన కాల్వగడ్డ రాజ్‌కుమార్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పేదల పక్షాన నిలుస్తూ ఆపదలో ఉన్నవారికి చేయూతనందిస్తున్న ఆయనకు భగవంతుడు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ముత్తంగి డివిజన్‌లో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలు, అవసరమైన కుటుంబాలకు నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని స్థానికులు అభినందించారు.

## సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ హామీ..

- **జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**
- **క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలకు అధికారులకు ఆదేశాలు**



**రామచంద్రపురం, జూలై 7 (సిరి న్యూస్):**

రామచంద్రపురం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మంగళవారం జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.జీహెచ్‌ఎంసీ కమిషనర్ సూచన మేరకు జోనల్ కమిషనర్‌ను కలిసి డివిజన్‌లోని రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.వినతిని పరిశీలించిన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ సానుకూలంగా స్పందించి, సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. పుష్పనగేష్ సూచించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే అవసరమైన నిధుల మంజూరు విషయమై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పుష్పనగేష్ తెలిపారు.ఈ సందర్భంగా పుష్పనగేష్ మాట్లాడుతూ, రామ చంద్రపురం డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించిన మావీన్ గౌడ్..



**రామచంద్రపురం, జూలై 7 (సిరి న్యూస్):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి) జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మావీన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డితో కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.మావీన్ గౌడ్ మాట్లాడుతూ, జగ్గారెడ్డి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజలకు మరింత చేరువై సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఓబీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జగ్గారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మున్సిపల్ కార్మికులకు 26,000 వేతనం ఇవ్వాలి

- **రెండో పిఆర్సి అమలు చేయాలి**
- **మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**
- **సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు.**

**నర్సాపూర్ జూలై 07, (సిరి న్యూస్)**

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలనీ మంగళవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్( సిఐటియు )ఆధ్వర్యంలో నర్సాపూర్ కమిషనర్ సాయి కుమార్ కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, పుష్ప మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికు లందరికీ పర్మినెంట్ చేయాలని రెండో పిఆర్సి అమలు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 26,000 వేతనం అందించాలి కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ,హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారుఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పనిచేసే కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వము మున్సిపల్ కార్మికుల యొక్క



సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని వర్షాకాల సమయంలో కార్మికులకు కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పుష్ప ,యూనియన్ అధ్యక్షులు రాములు నాయకులు శంకర్, అశోక్, అనిత, జ్యోతి, సంగీత, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆవరణను శుభ్రపరచిన పంచాయతీ సిబ్బంది





**వెల్దుర్తి,జులై07, (సిరి న్యూస్ ):**

సమస్యల ఒడి – ప్రభుత్వ బడి అనే శీర్షికకు స్పందించిన గ్రామపంచాయతీ అధికారులు పంచాయతీ సిబ్బందిచే ప్రాథమిక పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రపరిచి చెత్త, పిచ్చి మొక్కలను తీసివేశారు. అలాగే మంచినీరు ట్యాంకు వద్ద ఉన్న చెత్తను కూడా తీసివేసి పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రపరిచారు. ఒకటి రెండు రోజుల్లో మంచినీటి పైప్ లైన్ సమస్య కూడా తీరుస్తామని సర్పంచ్, ఉప సర్పంచ్ హామీ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. దీనికి సహాయ సహకారాలు అందించిన గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులు సృజన ఉపాధ్యాయ బృందం అభినందించారు. అలాగే అరేగూడం గ్రామంలో విద్యార్థులు కూర్చోనీకి గదిలేదు అనే విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చైతన్య హన్మంత్ రెడ్డి, తన సొంత నిధులతో చిన్నపాటి గది నిర్మాణం చేపట్టి విద్యార్థులకు కూర్చోవడానికి వీలుగా గది ని ఏర్పాటు చేశారు. ఇట్టి నిర్మాణానికి సహాయం చేసిన గ్రామ సర్పంచ్ చైతన్య హనుమంతు రెడ్డిని గ్రామస్తులు ఉపాధ్యాయ బృందం, అభినందించారు.


సమస్యల ఒడి - ప్రభుత్వ బడి

# మత్తు పదార్థాలను నిర్మూలించాలి

- **గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా..**
- **టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జూలై,07(సిరి న్యూస్)**

గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తూ మత్తు పదార్థాలను నిర్మూలించుటకు తెలంగాణ ఎక్సైజ్ మరియు ప్రోహిబిషన్ శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎక్సైజ్ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై పాఠశాలలు



,కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లా ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు, 5 బార్లు కు 2024–2025 వ సంవత్సరానికి 574.08 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని, 2025 వ సంవత్సరానికి 410. 44 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తామని, పాఠశాలలో ,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నాగేశ్వరరావు, నరేందర్, సలాం ముస్తఫా, మాన్ సింగ్, రాజేష్, రామచందర్, ఖాజా ఆహమ్మద్, అరుణ, విజయ్ సిద్ధార్థ, హరీష్ లు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఓటరు నమోదు చేసుకోవాలి

- **జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**జోగిపేట, జూలై 07, (సిరి న్యూస్):**

అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ అసెంబ్లీ స్థాయి కోర్ కమిటీ సమావేశంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రక్రియపై ఆందోల్ అసెంబ్లీ స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయడం, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అలాగే పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు మరియు బీ ఎల్ ఏ–2లు సమన్వయంతో పని చేస్తూ ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి బీజేపీ వైపు ఆకర్షితులయ్యే వారిని పార్టీలోకి చేర్చుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనంత్ రావు కులకర్ణి,ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,జిల్లా



ఉపాధ్యక్షులు వెంకట నర్సింహా రెడ్డి, ఎస్ సి మోర్చా జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు జగదీశ్, జిల్లా కార్యదర్శి ఎన్. భూమయ్య వివిధ మండలాల అధ్యక్షులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

**తూప్రాన్ జులై 7 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ టోల్గేట్ లో ఉన్న సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్జా తీయ రహదారి–44పై భద్రతా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని స్థానిక పోలీసు అధికారులకు సూచించారు కంట్రోల్ రూమ్ లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి జాతీయ రహదారి 44పై వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వాహనాలు



వ్యక్తుల కదలికలను వెంటనే గుర్తించి సంబంధిత పోలీసు స్టేషన్లో కు వెంటనే సమాచారం ఇవ్వాలని కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసే విధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కంట్రోల్ రూమ్‌లో అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది తీసుకునే చర్యలు సమాచార సేకరణ స్థానిక పోలీసు అధికారులు ఏదైనా సమాచారం అడిగిన వెంటనే ఇస్తున్నారా లేదా అత్యవసర సమయంలో వెంటనే స్పందించి అవసరమైన సీసీ రికార్డులను ఇవ్వాలని సూచించారు సాంకేతిక పరిజ్ఞానంతో తొందరగా నేరాల నియంత్రణతో పాటు రహదారి భద్రతను వాహనాల రాకపోకలను ప్రమాదాలను వెంటనే గుర్తించవచ్చని అదనపు ఎస్పీ తెలిపారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఎస్ఐ గంగరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ర్యాగింగ్ భూతన్ని తరిమెద్దాం.!

- ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
- యాంటీ ర్యాగింగ్ కమిటీలను సమర్థవంతంగా నిర్వహించాలి.
- నూతన విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలి.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

మెదక్ జూలై, 07(సిరి న్యూస్)




కళాశాలలు,హాస్టళ్లు ప్రారంభమైన నేపథ్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు.ర్యాగింగ్ అనేది చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కట్టుగా పనిచేయాలని తెలిపారు. నూతన విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం, శారీరక లేదా మానసిక వేధింపులకు పాల్పడడం వంటి చర్యలు చట్టరీత్యా కఠిన చర్యలకు దారితీస్తాయని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. హాస్టళ్లలో వార్డెన్లు ప్రత్యేక నిఘా ఉంచి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ర్యాగింగ్ దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించి, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మెదక్ జిల్లా పోలీసు శాఖ విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

# కలెక్టర్ ప్రతీక్ జైన్ అకస్మిక తనిఖీ

- పక్కాగా సాగాలి ఎన్యుమరేషన్
- అమీన్పూర్ లో పర్యటన

అమీన్ పూర్ జూలై 7 సిరి న్యూస్



అమీన్పూర్ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యటించి,ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ను పకడ్బందీగా నిర్వహించి లోపాలు లేని ఓటర్ జాబితాలు తయారు చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలన బూత్ లెవెల్ అధికారులు బిఎల్ఓ లు, ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, కార్యాలయంలో కూర్చుని తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని ఆయన ఆదేశించారు.అర్హులందరికీ అవకాశం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటర్ నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు.జాబితా ప్రక్షాళన మరణించిన వారి పేర్లు ఊరు వదిలి వెళ్ళిపోయిన వారి వివరాలు మరియు ఒకే ఓటర్కు రెండు చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను గుర్తించి వెంటనే తొలగించాలని ఆయన సూచించారు.గడువులోగా పూర్తి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం నిర్దేశిత గడువు లోపల ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియపై మరియు డిస్ట్రిబ్యూషన్ పై బీఎల్ఓలకు సూపర్వైజర్ లకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది, అని తెలిపారు.అమీన్పూర్ మండలంలోని 130,200,201 పోలింగ్ కేంద్రాల పరిధిలో చేపడుతున్న సర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈఆర్ఓ, తాసిల్దార్ వెంకటేష్, బిఎల్ వోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# 'సర్' దరఖాస్తులను తప్పులు లేకుండా నింపాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

మెదక్, జూలై 07(సిరి న్యూస్)



సర్ పారాలను తప్పులు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై మంగళవారం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని 34-మెదక్ , 37-నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 586 మంది బూత్ లెవల్ అధికారులు నియమించబడగా, వారందరికీ శిక్షణ పూర్తయిందని తెలిపారు.జిల్లాలోని మొత్తం 4,53,140 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పూర్తిగా డౌన్‌లోడ్ చేసి పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.ఇప్పటివరకు 4,38,409 ఫారమ్‌లు (96.75 శాతం) పంపిణీ చేయగా, 45,663 ఫారమ్‌లు (10.08 శాతం) డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు.ఇప్పటివరకు 21,092 మంది ఓటర్లు స్వయంగా వివరాలను నమోదు చేసుకోగా, 23,217 మంది ద్వారా వివరాలను సమర్పించారు. కేవలం 580 కేసుల్లో మాత్రమే మాపింగ్ పెండింగ్లో ఉందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల గడపకు ఎస్ఐఆర్..

- మన్నెగూడెలో ఇంటింటి ఎస్ఐఆర్ ప్రచారం.
- ఓటర్లకు కార్యక్రమంపై పూర్తి అవగాహన.
- ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు.
- కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం.

మంచిర్యాల ప్రతినిధి జూలై 7 (సిరి న్యూస్)







ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు నెన్నెల మండలం మన్నెగూడెం గ్రామంలో ఇంటింటి అవగాహన ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కాశీపాక రాజేష్, బెల్లంపల్లి నియోజకవర్గ బూత్ స్థాయి ప్రతినిధుల ఇన్‌చార్జి కాజా పాషా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ఎస్ఐఆర్ కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను ఓటర్లకు వివరించారు. ప్రతి ఒక్క అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేటి సంధ్య, సీనియర్ నాయకులు గురునాథం మల్లా గౌడ్, తోట శ్రీనివాస్, గన్న అంజన్న, గన్‌పూర్ సర్పంచ్ గన్న సతీష్, తిరుపతి రెడ్డి, ధారావత్ గణేష్, పోచిరెడ్డి, కృష్ణ, పెల్లి ఉపసర్పంచ్ సాయి గౌడ్, గంగయ్య, లింగయ్య, ధారావత్ రమేష్, రాజారాం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మన్నెగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతానికి పాడి గేదె బలి!

- వేలాడుతున్న కరెంటు వైర్లు
- పాడి రైతుకు తీరని లోటు
- అధికారుల నిర్లక్ష్యం రైతు జీవనధారం దెబ్బ

జిన్నారం జులై 7 సిరి న్యూస్



గడ్డపోతారం పురపాలక పరిధిలోని మాదారం గ్రామంలో మంగళవారం ప్రమాద వశాత్తు కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఒక పాడి గేదె అక్కడికక్కడే కరెంట్ షాక్ తో మృతి చెందింది. రైతు ఆవేదన చేతికి అందివచ్చిన పాడి గేదే మరణించడంతో సదరు రైతు కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురైంది. తమ జీవనాధారం దెబ్బతిన్నదని రైతు నవీన్ యాదవ్ కన్నీరు మున్నీరవుతున్నాడు. అధికారుల నిర్లక్ష్యంపై అగ్రహం పొలాల వెంబడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు,రైతులు విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పరిహారానికి డిమాండ్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నష్టపోయిన పేద పాడి రైతును ప్రభుత్వం,విద్యుత్ శాఖ తక్షణమే ఆర్థికంగా ఆదుకుని నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలిపారు.

# భారతి నగర్ అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

**సింధు ఆదర్శ్ రెడ్డి**

రామచంద్రపురం, జూలై 7 (సిరి న్యూస్):



భారతి నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి శేరి లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీడీఎల్ కాలనీలో కంపౌండ్ వాల్ నిర్మాణం, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ మరమ్మతులు, బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్ అద్దె ఛార్జీల తగ్గింపు, ఎంఎంటీఎస్–అన్నమయ్య ఎన్క్లేవ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, ఫెన్సింగ్ ఏరియా, ఎల్ఐజీ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు.వినతిపత్రంపై స్పందించిన జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# ఎస్ ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్..



రామచంద్రపురం, జూలై 7 (సిరి న్యూస్):

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు నమోదు, ధృవీకరణ ప్రక్రియతో పాటు బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు నాయక్, పటాన్‌చెరు ఈఆర్‌వో వెంకటేశ్వరరావు, రామచంద్రపురం తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ శ్వేత, మాస్టర్ ట్రైనర్లు, జీపీఓ, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ..



పటాన్ చెరు, జూలై 7 (సిరి న్యూస్):

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరులోని శ్రీ టంగుటూరి అంజయ్య స్మారక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కురి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కొల్కురి నరసింహారెడ్డి మాట్లాడుతూ, జగ్గారెడ్డి ప్రజాసేవకు అంకితమైన నాయకుడని కొనియాడారు. ఆయన కృషితో పటాన్‌చెరులో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, కంది ఐఐటీ, పటాన్‌చెరు బస్ టెర్మినల్ వంటి పలు అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. పేదల సంక్షేమం కోసం జగ్గారెడ్డి ఎల్లప్పుడూ కృషి చేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యువరాజ్, కార్మిక సంఘం నాయకులు భోజరాజు, సోములు, వెంకటేష్, రాజు, శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో నిందితుడికి శిక్ష

నర్సాపూర్ జూలై 7( సిరి న్యూస్)

గంజాయి విక్రయం కేసులో, మంగళవారం నర్సాపూర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణ అనంతరం నిందితుడిని ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 8(c) కింద కోర్టు దోషిగా నిర్ధారించింది. నిందితుడికి రూ.10,000/- జరిమానా విధించింది.గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నేరాలకు పాల్పడిన వారిపై ఎక్సైజ్ శాఖ చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై ముస్తఫా తెలిపారు

## స్వచ్ఛా తెలంగాణ పై - అవగాహన సదస్సు




• పంచాయతీ కార్యదర్శి కృష్ణ

**వెల్దుర్తి, జులై 07,(సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థుల కు స్వచ్ఛా తెలంగాణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నాలుగు రకాల అనగా తడి చెత్త, పొడి చెత్త,శానిటరీ చెత్త,ప్రత్యేక జాగ్రత్త చెత్త, డబ్బాలను పాఠశాల యందు, అలాగే మీ ఇంట్లో కూడా ఈ నాలుగు రకాల డబ్బాలను ఉపయోగించి ఏ చెత్త ను ఆ చెత్త డబ్బాలో వేస్తే ఎటువంటి జబ్బులు రాకుండా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి కృష్ణ తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య మాట్లాడుతూ, తడి,పొడి చెత్తను వేరు చేయడం.సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం.ప్రతి ఒక్కరూ పరి శుభ్రతను తమ బాధ్యతగా భావించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, వెంకటస్వామి, నర్సింహారెడ్డి, అర్చన, జయసుధ, అమూల్య, రాధికా ప్రియదర్శిని, రాము, చార్లెస్, సునీత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పొలం గట్టు పైనుండి పడి కౌలు రైతు మృతి

**వెల్దుర్తి,జులై 07,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలంలోని శేరిలా గ్రామంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన శంకూర్ శేకులు (35) గ్రామంలో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో వరినారు వేసేందుకు ట్రాక్టర్ తో భూమిని చదును చేస్తున్నాడు. సోమవారం ట్రాక్టర్లోకి డీజిల్ తెచ్చేందుకు వెళ్లి తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గట్టు పైనుండి పొలంలోని బురదలో పడడంతో ఊపిరాడకపోవడంతో రైతు శేకులు అక్కడికక్కడే మృతి చెందాడు. ముతుడికి భార్య విజయ ఇద్దరూ కుమారులు కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపారు.



## కొండాపూర్ లో ఘనంగా టీజేఆర్ జన్మదిన వేడుకలు



**కొండాపూర్, జూలై 7(సిరిన్యూస్):**

మండల కేంద్రమైన కొండాపూర్ లో మంగళవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.తమ అభిమాన నేత పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలను పెద్ద ఎత్తున జరిపించారు. ఆపదలో ఉన్న వారికి ఆప్తుడిగా..అన్నగా నిలుస్తాడంటూ జగ్గారెడ్డి జిందాబాద్.. పేదల పెన్నిధి జిందాబాద్ నినాదాలతో అభిమానులు సభాస్థలని హోరేతిచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి లో ఉన్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ లు శ్రీకాంత్ రెడ్డి,మాణిక్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్ ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, అభిమానులు,కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్ఎంటి కాలనీ డ్రైనేజ్ కష్టాలు తీర్చండి!

### ఎంపీ కి నివాసితుల వినతి

**అమీన్పూర్ జులై 07 సిరి న్యూస్**



అమీన్పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని హెచ్ఎంటి కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీ నివాసితులు ఎంపీ రఘునందన్ రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కొత్తపల్లి రమేష్ మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందులు డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరి మురుగు కోపంగా మారడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, కాలనీవాసులు నడిచే బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు. నిలిచిన మురుగు నీటి వల్ల దోమలు ప్రబలి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని అన్నారు. ఎంపీ హామీ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఎంపీ రఘునందన్ రావు అధికారులతో మాట్లాడి డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ లక్ష్మణ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వివో భవనానికి భూ పంచాయితీ!

## వివో భవనానికి భూ వివాదం.

• ఆకనపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు.
• ప్రభుత్వ భూమిపై ఇరు వర్గాల వాదనలు.
• అధికారుల జోక్యం కోసం గ్రామస్తుల డిమాండ్.

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 7 (సిరి న్యూస్)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకనపల్లి గ్రామంలో వసుంధర గ్రామ సంఘానికి మంజూరైన విలేజ్ ఆర్గనైజేషన్ (వివో) భవన నిర్మాణం భూ వివాదంలో చిక్కుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ అధికారులు చూపించిన స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించే ప్రయత్నం చేయగా, అదే భూమి తమదంటూ కొందరు ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తులు అడ్డుకోవడంతో వివాదం మరింత ముదిరింది.

**తహసీల్దార్ చూపిన స్థలంలోనే వివాదం..**

బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆకనపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిని వివో భవన నిర్మాణం కోసం గుర్తించింది. అధికారులు స్థలాన్ని అప్పగించిన అనంతరం నిర్మాణానికి గుర్తుగా ముగ్గు వేయగా, వెంటనే కొందరు వ్యక్తులు ఆ ముగ్గును చెరిపివేసి, ఆ భూమి ఎస్సీలకు కేటాయించిన భూమి అని అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఇరు వర్గాల మధ్య భిన్న వాదనలు..**

వివో సంఘాల సభ్యులు మాట్లాడుతూ, సంబంధిత భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని, అక్కడ వివో భవనం నిర్మిస్తే డ్వాక్రా మహిళా సంఘాలకు శాశ్వతంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మరోవైపు బచ్చలి శంకర్, బచ్చలి స్వామి ఆ భూమి తమదేనని చెబుతూ నాలుగు వైపులా హద్దులు ఏర్పాటు చేసి, ట్రాక్టర్‌తో దున్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సర్పంచ్‌పై ఒత్తిడి..పోలీసుల జోక్యంతో**




**అదుపులోకి వచ్చిన ఉద్రిక్తత..**

ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని నియంత్రించారు.

**అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలంటున్న గ్రామస్తులు..**

గ్రామానికి మంజూరైన వివో భవన నిర్మాణం ఆలస్యం కాకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని భూ వివాదాన్ని పరిష్కరించాలని వివో సంఘాల సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు. డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి కీలకమైన ఈ భవన నిర్మాణాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై రెవెన్యూ, పోలీసు





శాఖల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అధికారుల విచారణ అనంతరం పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**తదుపరి విశేషాలు సిరి తెలుగు దినపత్రిక సంచికలో వెలుగులోకి..**

ఆకనపల్లి గ్రామంలో వివో భవన నిర్మాణం చుట్టూ నెలకొన్న భూ వివాదం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమా.? ఎస్సీలకు కేటాయించిన స్థలమా.? అనే అంశంపై అధికారుల విచారణ తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రెవెన్యూ, పోలీసు శాఖలు తక్షణమే జోక్యం చేసుకుని వాస్తవాలను నిర్ధారించి, గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పడంతో పాటు వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో అధికారుల స్పందన, ఇరు వర్గాల పూర్తి వాదనలు, విచారణలో వెలుగులోకి వచ్చే కొత్త అంశాలు, తదుపరి పరిణామాలపై ప్రత్యేక కథనాలతో. సిరి తెలుగు దినపత్రిక తదుపరి సంచికలో మరిన్ని విశేషాలు.



కొన్ని రోజుల క్రితం భవన నిర్మాణం కోసం ముగ్గు పోస్తున్న దృశ్యం

# బెల్లంపల్లిలో ఎంఆర్పీఎస్ శక్తి ప్రదర్శన.

• ఎస్సీ కాలనీలో ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరణ..
• మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా..
• సామాజిక న్యాయ సాధనకు నాయకుల పిలుపు..
• భారీగా పాల్గొన్న ఎంఆర్పీఎస్ కార్యకర్తలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 7 (సిరి న్యూస్)**

ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి బస్తీ 19వ వార్డు ఎస్సీ కాలనీలో జెండా ఆవిష్కరణతో పాటు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్, ఎంఆర్పీఎస్ అధికార ప్రతినిధి కోరల్ల చంద్రశేఖర్ మాదిగ, పులిపాక మోహన్ మాదిగ, అక్కపాక నరసయ్య మాదిగ, కాంపెల్లి శ్రీనివాస్ మాదిగ, అక్కపాక రంజిత్ కుమార్ మాదిగ, అక్కపాక నరేష్ కుమార్ మాదిగ, కాంపెల్లి శివకుమార్ మాదిగ, నక్క రాజు మాదిగ, కుమ్మరి శివ మాదిగ, కడపాక రామకృష్ణ మాదిగ, జన్ను అశోక్ మాదిగ, మిట్టపల్లి నారాయణ మాదిగ, కుమ్మరి గ్రేసమా మాదిగ, అంబాల లక్ష్మీ మాదిగ, కాంపెల్లి ఎల్లమ్మ మాదిగతో పాటు ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు. ఎంఆర్పీఎస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సామాజిక న్యాయం సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



# ఫామ్ హౌస్ కు యాక్ట్ వర్తించదా?

• మందమర్రి మండల తహసిల్దార్ పి సతీష్ కుమార్ కు వినతి పత్రం సమర్పణ
• బి ఎస్ పి నాయకులు

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 07 (సిరి న్యూస్)**

మందమర్రి మండల తహసిల్దార్ పి సతీష్ కుమార్ గారికి వినతి పత్రం సమర్పించిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, మందమర్రి శివారు మున్సిపాలిటీ పరిధిలోని సీలింగ్ పట్టా భూమి సర్వేనెంబర్ 347/2, మూడు ఎకరాల 20 గుంటల ఫామ్ హౌస్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, 1/70 యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ నిర్మాణం జరుగుతుందనీ, ఇట్టి భూ యజమాని బూనేని రాజు తండ్రి భూమయ్య అట్టి భూమిని ఇతర కమ్యూనిటీ వ్యక్తి కి విక్రయించాడని ఆ వ్యక్తి ఆ భూమిలో ఫామ్ హౌస్ నిర్మిస్తున్నారని అట్టి సీలింగ్ పట్టను రద్దుచేసి భూమిని స్వాధీన పరుచుకుని మందమరి పట్టణ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించవలసిందిగా కోరమన్నారు బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎండి మతీన్ ఖాన్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గోమాస బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ స్థాయి క్రిడల్లో రానించాలి

• తెలంగాణ స్టేట్ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ మీట్.
• 350 మంది క్రీడాకారులు హాజరు.
• మెదక్ లో సింతటిక్ ట్రాక్ ఉండడం ఒక వరం.
• అథ్లెటిక్స్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి.
• జిల్లా విద్యాధికారి రాజు

**మెదక్ జూలై, 07(సిరి న్యూస్)**






విద్యార్థులు చదువుతో పాటు క్రిడల్లో రానించాలని, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ లో ప్రతిభ కనబరిచి జిల్లాను ముందు వరుసలో నిలుపాలని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు.మంగళవారం మెదక్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణార్తి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందుంటుందని, ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజీరెడ్డి, యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్,రిటైర్డ్ పిడి ప్రభు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి మధు సూదన్, ఫిజికల్ డైరెక్టర్లు రాజేందర్,నాగరాజు,సత్యనారాయణ,సుజాత, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# వాళ్ళ.. చీరలోని గొప్పతనం తెలుసుకో..

పెండ్లి అంటేనే ట్రెడిషనల్ డ్రెస్ గుర్తొస్తుంది. అందులో చీరకు సాటి లేదు. అందుకే చాలామంది పెండ్లి వేడుకకు చీర కట్టుకోవడానికి ఇష్టపడతారు. ఇక అంబానీ పెండ్లి వేడుకలో కూడా చాలామంది అతిథులు తమదైన స్టయిల్లో చీరల్లో తళుక్కుమన్నారు. మరి వాళ్లెవరో.. వాళ్లు కట్టిన చీర స్పెషాలిటీ ఏంటో తెలుసుకుందామా. అనంత్ అంబానీ – రాధిక మర్చెంట్ ఇటీవలె పెండ్లితో ఒక్కటయ్యారు. అయితే, ఆ పెండ్లి వేడుక ఎంత వైభోగంగా జరిగిందో తెలిసిందే. ఆ వేడుకలో డెకరేషన్ నుంచి విందు, వినోదం, దుస్తులు, నగలు అన్నీ ప్రత్యేకమే. అంగరంగ వైభవంగా జరిగిన ఆ వేడుకలో పెండ్లి ఇంటి వాళ్లే కాదు.. ఆ వేడుకకు విచ్చేసిన అతిథులు కూడా తమదైన మార్క్ చూపించారు. పెండ్లి అయి పది రోజులు అవుతున్నా.. అతిథులు ధరించిన దుస్తులూ, నగల గురించి ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నారు.

## దీపిక చీర.. తయారీకి 3000 గంటలు

రీసెంట్ గా ప్రభాస్ కల్కి 2898 AD లో నటించిన దీపికా పదుకొణె అంబానీ ఇంట పెండ్లి వేడుకల్లో ఒకటైన సంగీత్ పార్టీకి పర్పుల్ కలర్ చీర ధరించింది. ఆ చీరలో దీపికా తన బేబీ బంప్‌తో కనిపించింది. ఆమె ధరించిన ఈ చీర ఫాబ్రిక్ ఆర్గాన్జా, జెన్నీ సిల్క్ తో తయారు చేశారు. అంతేకాదు ఈ చీరను చేతితో ఎంబ్రాయిడరీ చేశారు. దీని తయారీకి దాదాపు 3,400 గంటలు పట్టింది. ఈ చీరను 'హుకుమ్ కి రాణి చీర' అంటారు. దీని ధర రూ.1 లక్ష 92 వేలు.



## ఆలియా చీరకు వందేళ్ల చరిత్ర!

ఆ వేడుకలో బాలీవుడ్ నటి ఆలియా పింక్ కలర్ చీరలో మెరిసింది. ఈ చీర ప్రత్యేకత ఏంటంటే.. ఇది 160 ఏళ్ల క్రితం గుజరాత్‌లో నేసిన ఆశావాలీ చీర. వందల ఏళ్ల క్రితం నేసిన యాంటిక్ చీరల్ని సేకరించే మనీష్ మల్హోత్రా కలెక్షన్‌లో ఇదీ ఒకటి. అప్పట్లో దీన్ని అత్యంత స్వచ్ఛమైన పట్టుతో నేశారు. 99శాతం వెండి, 6 గ్రాముల బంగారం కలగలిపి నేసిన జరీ అంచుతో చూపరులను కట్టిపడేస్తోన్న ఈ చీర ఖరీదు అక్షరాలా 2 కోట్ల రూపాయలు. ఆశావాలీ బ్రొకేడ్ 16వ శతాబ్దానికి చెందినది. అహ్మదాబాద్‌ను ఒకప్పుడు ఆశావాలీ పిలిచేవారు. అక్కడ పుట్టడం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. అక్కడి ఖత్రీ, పటేల్ వంశస్థులు రూపొందించిన వీటిని రాజకుటుంబీకులు చీరలు, తలపాగాలు, కర్టెన్లూ, వంటివాటికోసం ఎక్కువగా వాడేవారు. ఈ వస్త్రాలను కిమ్‌ఖ్వాబ్ అని పిలిచే క్లిష్టమైన బ్రొకేడ్ పనితనంతో తీర్చిదిద్దేవారు. సంప్రదాయ మగ్గాలపై నేసిన ఈ చీరలపై ట్విల్ వీవ్‌తో జంతువులు, పక్షులు, పూలు, పైస్లీలు, మానవ రూపాలను మోటిఫ్‌లుగా రూపొందించారు. అలానే, మొఘలుల కాలం నాటి ఆర్కిటెక్చర్ జాలీ డిజైన్ లో కనిపిస్తుంది.





## రష్మిక చీర ధర లక్షపైనే..

పెళ్లికి ముందు శుభ్ ఆశీర్వాద్ అనే ప్రత్యేకమైన ఈవెంట్‌ను ప్లాన్ చేసింది అంబానీ ఫ్యామిలీ. ఆ ఈవెంట్ కోసం షిమ్మరింగ్ బ్లూ శారీని ధరించింది రష్మిక. అది చూసి ఏంటి ఇంత సింపుల్గా వచ్చింది అనుకున్నారంతా. కానీ, ఆ చీర ధరెంతో తెలిశాక అవాక్కవుతున్నారు. నిధి తాంబి కేజ్రివాల్ డిజైన్ చేసిన ఈ చీర ధర రూ.1.28 లక్షలు అని తెలుస్తోంది. ఈ శారీపై సింపుల్‌గా స్లీవ్‌లెస్ డార్క్ బ్లూ బ్లౌజ్‌ను ధరించింది ఈ బ్యూటీ.



# అందమైన అధరాల కోసం..



చర్మం తేమను కోల్పోతే ఆ ప్రభావం పెదాలపై కూడా పడుతుంది. తద్వారా పెదాలు పొడిబారతాయి. అలాంటప్పుడు ఈ చిట్కాలు ఫాలో అవ్వండి. పెదాలకు మునుపటి మెరుపు తీసుకురండి.

కొన్ని గులాబీ రేకల్లో పచ్చి పాలు పోస్తూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమంతో పెదాలపై కాసేపు మృదువుగా రుద్దుకొని కడిగేసుకుంటే ఇటు పెదాలు తేమను తిరిగి పొందుతాయి.

తేనె, బ్రౌన్ షుగర్.. రెండిటినీ సమపాళ్లలో తీసుకుని. అందులో కొన్ని చుక్కల లావెండర్ నూనె కలిపి పెదాలపై పూసుకోవాలి. రెండు నిమిషాల పాటు నెమ్మదిగా మర్దన చేసి ఆపై కడిగేస్తే పెదాలు మృదువుగా మారతాయి.

దాల్చిన చెక్క పొడి, తేనె, ఆలివ్ నూనె అర టీస్పూన్ చొప్పున తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై పూసి, మర్దన చేయాలి. కాసేపటి తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడగాలి. ఆపై లిప్ బామ్ పూయాలి.

బరకగా ఉన్న కాఫీ పొడి, తేనె.. ఈ రెండింటినీ టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో పెదాలపై నెమ్మదిగా మర్దన చేసుకొని రెండు నిమిషాల తర్వాత కడిగేసుకుంటే పొడి బారిన పెదాలు మెరుస్తాయి.

కమలా పండు తొక్కల పొడి, బ్రౌన్ షుగర్ రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున తీసుకొని అందులో కొన్ని చుక్కల బాదం నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో 30 సెకన్ల పాటు పెదాలపై మర్దన చేసి కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చాలు.







# ఉపవాసంతో క్యాన్సర్కు చెక్!

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ ముప్పు రోజు రోజుకు పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ నివారణ, క్యాన్సర్‌ను ప్రభావితం చేసే అంశాలపై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. వీటి ద్వారా క్యాన్సర్ కణాలు వృద్ధి చేందే విధానం, క్యాన్సర్‌కు కారణమయ్యే పరిస్థితులు, దాన్ని నయం చేసే విధానాల గురించి చాలా కొత్త విషయాలు తెలుస్తున్నాయి. వాటిలో తాజాగా ఉపవాసం కూడా ఒకటి అని తేలింది. మెమోరియాల్ స్లోన్ కెట్టరింగ్ క్యాన్సర్ సెంటర్ లోని పరిశోధకులు చేసిన ప్రయోగాల్లో ఉపవాసం వల్ల శరీరంలోని సహజమైన రక్షణ వ్యవస్థ బలోపేతం అయినట్లు తేల్చారు. ఉపవాసం ఒక నాచురల్ కిల్లర్‌లా క్యాన్సర్ కణాల మీద పని చేస్తుందని పరిశోధకులు తెలిపారు. క్యాన్సర్ కణాల మీద దాడి చేసే కీలక భాగం రోగనిరోధక వ్యవస్థ. ఉపవాసంతో అది చురుకుగా మారుతుందని పేర్కొన్నారు. స్వల్పకాలిక ఉపవాసం ఆరోగ్యకరమైన కణాలను రక్షించగలదని 2012 లో ఎలుకల మీద చేసిన ప్రయోగాల్లో తేలింది. 2016లో స్వల్పకాలిక ఉపవాసం కీమోవల్ల కలిగే విషప్రభావాన్ని చాలావరకు తగ్గించినట్టు గుర్తించారు.

**రెండు రోజుల ఉపవాసం**

జర్మన్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ చేసిన మరొక అధ్యయనంలో.. అప్పుడప్పుడు చేసే ఉపవాసాల వల్ల కాలేయం, క్యాన్సర్ మీద ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాలను తెలుసుకున్నారు. ఐదు రోజుల పాటు ఒక క్రమపద్ధతిలో తిని.. రెండు రోజుల పాటు ఒక నిర్ణీత విధానంలో ఉపవాసం చేసినట్టయితే ఫ్యాటీ లివర్, లివర్ ఇన్ఫ్లమేషన్ లేదా కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించవచ్చని నిపుణులు చెప్తున్నారు.

**క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయట**

ఉపవాసం క్యాన్సర్ ప్రభావాన్ని తగ్గించడం మాత్రమే కాదు. ఇన్సులిన్ స్థాయిలను తగ్గిస్తుంది. తద్వారా క్యాన్సర్ వృద్ధిని నివారిస్తాయి. ఉపవాసం వల్ల చెడిపోయిన కణాలు శరీరం నుంచి తొలగిపోతాయి. క్యాన్సర్ ముదిరిపోక ముందే ఈ కణాలను నాశనం చేస్తాయి. అయితే, ఉపవాసం చెయ్యాలా? వద్దా? అనేది తమ తమ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

**ఇంకా ప్రయోగదశలోనే..**

ఈ అధ్యయనాలు క్యాన్సర్ చికిత్స, నివారణపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. అయితే, ఇప్పటి వరకు నిర్వహించిన ప్రయోగాలన్నీ ఎలుకల మీదే జరిగాయి. మనుషుల మీద ఈ ప్రభావాలు ఎలా ఉంటాయనేది ఇంకా నిర్ధారించాల్సి ఉంది. ఈ అధ్యయనంలో ఉపవాస ప్రభావాలలో నిర్దిష్ట ప్రొటీన్లను హైలైట్ చేసినట్టు గమనించారు. ఈ ప్రొటీన్ల పనితీరును బాగా అర్థం చేసుకోగలిగితే మరింత పురోగతి సాధించే అవకాశం ఉంటుంది.

# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్




ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

# ఇక నుంచి అలాంటి సినిమాలే చేస్తా

## కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాతృత్వం తర్వాత తనలో వచ్చిన మార్పులను ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాల విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత ప్రతి కథను అతడి కోణంలోనే ఆలోచిస్తున్నానని కాజల్ చెప్పారు. భవిష్యత్తులో తన తల్లి మంచి సినిమాలు చేసిందని కొడుకు గర్వంగా చెప్పుకునేలా ఉండే కథలనే ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందుకే నటనకు ప్రాధాన్యం ఉన్న, మంచి సందేశం ఇచ్చే సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. 'రామాయణ'లో మండోదరి పాత్ర పోషిస్తున్నానని చెప్పగానే నీల్ ఎంతో ఆనందపడ్డాడని కాజల్ తెలిపారు. అతడికి రామాయణ కథలు, ముఖ్యంగా రావణుడి పాత్ర అంటే చాలా ఇష్టమని చెప్పారు. ఈ సినిమా రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్ థియేటర్‌లో చూసే తొలి చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వల్ల కలిగే ప్రమాదాలను ఈ చిత్రం చూపిస్తుందని చెప్పారు. ఈ సినిమా కోసం చేసిన అధ్యయనం తన వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని, కుటుంబ సభ్యుల ఆహారపు అలవాట్ల విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని కాజల్ వెల్లడించారు.



# నా అందాలు దాచేసుకున్నా

## నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి

గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి - పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది.ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.




# సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.